
# ఆత్మవిశ్వాసం

— అరుణాచలం



కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ దాటింది. పరిసరాలు చాలా కొత్తగా కనిపించాయి జ్యోతికి. ఆ మార్గంలో ప్రయాణం చేయటం ఆమెకు అదే మొదలు రైలు చాలా వేగంగా పోతున్నది ఒకటే కుదుపు తన స్నేహితురాళ్లను చూడటానికి గుంటూరు నుంచి ఏలూరు, బాపట్ల మొదలయిన చోట్లకి వెళ్లిందికాని, కొంచెం దూరం ప్రయాణం చేయటం ఇదే ప్రథమం ఇంతసేపు కిటికీలోంచి పరిసరాలను తిలకించటంలో మునిగిపోయిన జ్యోతి తన పెట్టెలో పక్కన ఎవరు కూర్చున్నారా అని పరీక్షగా చూడలేదు అలా బయటకు చూసి చూసి విసుగు పుట్టేడప్పటికి, అక్కడ కూర్చున్నవారి మీదకు దృష్టి మరల్చింది. తన పక్కన ఒక నడివయస్సు స్త్రీ కూర్చుంది ఆమె పక్కన ఒక యువకుడు కూర్చున్నాడు తను అతనిని సరిగా చూడకపోయినా, అతను తనని దీక్షతోనే చూస్తున్నట్లు కనిపించింది ఆమెకు. ఎదురుగుండా కూర్చున్న యువతి, అసలు చుట్టు పక్కలవారి ఉనికినే గమనించినట్లులేదు ఏదో పత్రికా పఠనంలో మునిగిపోయింది

జ్యోతి తనతో పుస్తకాలు ఏవీ తీసుకురాలేదు. ఆ రకం ప్రయాణాలలో పుస్తకాల అవసరం ఉంటుందని ఆమెకు తెలీదు కాని ఎంతసేపు ఆమె అలా కూర్చోగలదు ? ఎదురుగుండా కూర్చున్న యువతిని పలకరించి లాభం లేదు ఆ యువకుడుతో తను చొరవచేసి మాట్లాడితే ఏం బాగుంటుంది ? పక్కనున్న స్త్రీతో మాట్లాడదామనుకుంది.

కాని పక్కవాళ్లతో మాట్లాడదామంటే, చొరవ తీసుకోలేకపోతున్నది కొత్త బెరుకు లేకుండా తను ఎక్కడికయినా పోగలనని, ఎక్కడయినా ఉండగలనని జ్యోతికి నమ్మకం ఎక్కువగా ఉండేది. ఆ సంగతే తన క్లాస్‌మేట్స్‌కి చెప్పేది కాని తీరా ఒంటరిగా ప్రయాణం చేస్తూ, ప్రక్కన కూర్చున్న ఆడవాళ్లతో మాట్లాడటానికి, నోరు పెగలటం లేదు 'మాటలు కోటలు దాటుతాయి, కాళ్లు గడప దాటవనీ' తల్లి అంటుండేది. దాని అర్థం ఆమెకు ఇప్పుడు గోచరించింది

ఇంతలో ఏమనుకుందో ఏమోకాని ఆ మధ్యవయస్సు స్త్రీయే జ్యోతిని పలకరించింది. 'ఏ వూరు వెళుతున్నావమ్మాయి ?' అని అడిగింది

'హైదరాబాదు' అని చెప్పింది జ్యోతి

'మీరు హైదరాబాదులోనే ఉంటారా ?' అంది ఆమె మళ్లా

'మాది గుంటూరండి మా బాబాయివాళ్లు హైదరాబాదులో ఉంటే చూడటానికి వెళ్లుతున్నాను' అంది. ఆపైన ఆమె ఏమీ అడగలేదు. కాని జ్యోతికి తను చెప్పిన సమాధానం నచ్చలేదు. ''బి ఏ పాసయ్యాను ఉద్యోగం చేసి స్వతంత్రంగా బతుకుదామని నా ధ్యేయం అందుకొరకే హైదరాబాద్ వెళుతున్నాను'' అని ఎవరయినా అడగంగానే సమాధానం చెప్పాలి, అని అనుకుంది. కాని ఆ రకంగా చెప్పలేకపోయింది. పినతండ్రి గారింటికి పోతున్నానన్న సమాధానమే అప్రయత్నంగా బయటకు వచ్చింది

ఎదురుగా కూర్చున్న యువతి పుస్తకం చదవటం ఆపి ఏదో ఆలోచిస్తున్నట్లు కూర్చుంది ఆమె నడిగి ఆ పత్రిక తీసుకుంది జ్యోతి మొదటి పేజీనుంచి చివరి పేజీదాకా పత్రికను తిరగేసింది తరువాత ఒక కథ చదవటం మొదలుపెట్టింది జ్యోతి కథ మొదలుపెట్టిందో లేదో ఆ యువతి ఆమెతో మాట్లాడటం సాగించింది

''మీరేం చేస్తున్నారు'' అని అడిగింది

''బి. ఏ పాసయ్యాను'' అని చెప్పింది జ్యోతి

''పై చదువులు చదువుతారా ? ఉద్యోగం చేస్తారా ?'' అని అడిగింది

''ఉద్యోగమే చేద్దామనుకుంటున్నాను'' అంది

తరువాత తన పినతండ్రిని గురించిన వివరాలు అడిగింది. ఆ సంభాషణ ముగియటంతో, కథ చదవడం సాగించింది జ్యోతి.

ఇంతలో ఖాజీపేట వచ్చింది చాలామంది పెట్టెలోనుంచి దిగి ప్లాట్‌ఫాం మీదకు వెళ్లారు నడివయస్సు స్త్రీ పక్కన కూర్చున్న యువకుడు, జ్యోతివంక, ఎదురుగుండా కూర్చున్న ఇంకో యువతి వంక చూస్తున్నాడు కాని ఏమీ మాట్లాడలేదు కాని ఖాజీపేటలో రైలు ఆగగానే 'కాఫీ తెచ్చిపెట్టమంటారా ?' అని అడిగాడు రైలులోనే ఇప్పటిదాకా కాఫీ సప్లై చేస్తూంటే ఈ యువకుడు, ప్లాట్‌ఫాంనించి కాఫీ తెస్తానంటాడేమా అనుకొని, 'వద్దులెండి' అంది అతను దిగి ప్లాట్‌ఫాంమీద కాఫీ త్రాగటం జ్యోతి చూసింది రైలు బయలుదేరే వేళ అయింది కావాల్సి అందరూ పెట్టెల్లోకి ఎక్కారు

రైలు బయలుదేరగానే ఆ యువకుడు జ్యోతిని మళ్లా పలకరించాడు — ''మీరు హైదరాబాద్ వెళ్లటం ఇదే మొదటిసారా ?'' అని అడిగాడు

''అవునండి ఇదివరకెప్పుడూ రాలేదు'' అంది జ్యోతి

''హైదరాబాదు చాలా బాగుంటుందండి కొన్నాళ్లు అక్కడ కనుక ఉంటే, మళ్లా మీరు గుంటూరు వెళ్లి ఉండలేరు'' అన్నాడు — జ్యోతి సమాధానం ఏం చెప్పకుండా ఒక చిరునవ్వు నవ్వి ఊరుకొంది ఇతనికి ఇంత చొరవ ఏమిటో అన్నట్టు ఆ నడివయస్సు స్త్రీ, ఆ యువకుడి వంక కొంచెం ముఖం చిట్లించి చూసేటప్పటికి అతని వాక్ ప్రవాహం కట్టుబడింది ఇకా అతను ఏమీ

# ఆత్మ విశ్వాసం

మాట్లాడలేదు ఆ ముగ్గురు స్త్రీలు ఏవో కబుర్లు చెప్పుకోటం సాగించారు వాళ్ళ మాటల్లో పడటంతో టైమ్ ఇట్టే గడిచిపోయింది రైలు సికిందరాబాదు సమీపించింది అందరూ సామాన్లు సర్దుకోవటం మొదలుపెట్టారు

"మీ వాళ్ళ ఎవరన్నా స్టేషన్‌కి వస్తారా" అని అడిగింది జ్యోతిని ఆ నడివయస్సు స్త్రీ

'మా బాబాయి వస్తాడ'ని చెప్పింది జ్యోతి

ప్లాట్‌ఫాంమీద రైలు ఆగగానే, బాబాయిని చూసింది జ్యోతి ప్రక్క స్త్రీలతో 'వస్తానండి' అని చెప్పి ప్లాట్‌ఫాంమీదకు దిగింది

'ప్రయాణం సుఖంగా జరిగిందా జ్యోతీ!' అంటూ దగ్గరకు వచ్చాడు జనార్దన్

'హాయిగానే జరిగింది బాబాయ్!' అని చెప్పింది తను తెచ్చిన సూట్‌కేస్ తీసుకొని పినతండ్రితో స్టేషను బయటకు నడిచింది జ్యోతి

ఇంటికి వెళ్ళగానే స్నానం చేసి పిన్ని, బాబాయిలతో కలిసి భోంచేసింది. భోజనం చేసేటప్పుడు పిన్ని గుంటూరులో విశేషాలు అడిగింది తన తల్లిదండ్రుల క్షేమం అడిగింది ఆ పూటకు ఆ కబుర్లు తప్ప తను ఇంకేం మాట్లాడలేకపోయింది తను వచ్చిన పనిని గురించి అప్పుడే చర్చించాలని ఆమెకు తాపత్రయంగా ఉంది ఏవో మాటలు చెప్పి ఆ అవకాశం ఇయ్యటం లేదు

బాబాయి "ప్రయాణం చేసి అలిసిపోయావు, ఇంక పడుకో అమ్మా!" అని బాబాయి అక్కడి నుంచి వెళ్ళాడు

"ఆ అమ్మాయిని మాట్లాడనీయకుండా ఒకటే ఊదరపెట్టారేమిటి?" అని అడిగింది లలిత జనార్దన్‌ని

"లేకపోతే ఇప్పుడే ఉద్యోగ ప్రయత్నానికి బయలుదేరమంటుంది" అన్నాడు

"మీరు మరీను ఆ అమ్మాయి సంకల్పాన్ని, పట్టుదలను మెచ్చుకోకపోగా, తేలికగా తీసెయ్యటం అన్యాయం" అంది అతని పక్షపాతబుద్ధిని ఎత్తిచూపిస్తూ

"కాని అన్నయ్యవాళ్ళ సంగతేమిటి? పెళ్ళి చేసి, తమ బాధ్యత తీర్చుకోలేదని వాళ్ళు బెంగపడుతుంటే, ఇదేమొ ఆదర్శాలని ధ్యేయాలని మొండిపట్టు పట్టుకు కూర్చుంది" అన్నాడు జ్యోతి దృష్టిని ఆ వైపునుంచి మళ్ళించటం ఎలాగ అని ఆలోచిస్తూ

"ఈ రోజులలో ఎంతమంది ఆడపిల్లలు అలా స్వతంత్రంగా ఉండటంలేదు మీరు, మీ అన్నయ్య ఒకటే ఇదైపోతున్నారు" అంది వాళ్ళు మగవాళ్ళ కనుక అలా చేస్తున్నారని అర్థం వచ్చేటట్లు

"మాకంటే మా వదినే ఇంకా ఎక్కువ బాధపడుతున్నది అసలు ఆమెకు జ్యోతిని పెద్ద చదువులు చదివించటమే ఇష్టంలేదు" అన్నాడు

"ఇదే మగపిల్లవాడు అయితే అసలు ఈ విషయం గురించి మనం అసలు చర్చించేవాళ్ళమా! చాలా మార్పులు వచ్చాయంటారు — మాటల్లో స్త్రీ, పురుషులు సమానం అంటారు — వరి పరిస్థితులు చూస్తే ఇలా ఉన్నాయి" అంది

'సరే, కాలం గడిచినకొద్దీ నువ్వే తెలుసుకుంటావు' అని అంతటితో ఆపాడు ఆ సంభాషణను జనార్దన్

"జ్యోతి! ఏం ఉద్యోగం చేద్దామనుకుంటున్నావు" అడిగాడు జనార్దన్ ఆమె అభిప్రాయం తెలుసుకోవాలని

"నా అర్హతలతో దొరికే ఏ ఉద్యోగమయినా చేస్తాను" అంది జ్యోతి

'అమ్మాయ్! మొత్తానికి గట్టిపట్టే పట్టావు' అన్నాడు కొంచెంసేపు ఆగి

'బాబాయి, నేను ఇలా చేయటం నీకు కూడా నచ్చలేదా?' అని అడిగింది

'నచ్చటం నచ్చకపోవటం కాదమ్మా! మీ అమ్మా, నాన్నా వాళ్ళ ఎంత బాధపడుతున్నారో గ్రహించావా? అన్నయ్య అన్ని వివరాలతో ఉత్తరం రాశాడు మరి వాళ్ళ విషయం కూడా నువ్వు ఆలోచించాలి కదా!"

"ఇప్పుడు నేను చేసిన దానివల్ల అంత బాధపడాల్సిన అగత్యమేముంది చెప్పు బాబాయ్ ఉద్యోగం చేస్తాను — నా కాళ్ళమీద నేను బతుకుతాను అనటం తప్పా? దానికోసం మీరందరూ ఇంత బెంబేలు పడటం ఏమిటో అర్థం కావటంలేదు" అన్నది కొంచెం ఆవేశంగా జ్యోతి

జనార్దన్ మౌనం వహించాడు బాబాయి ఇలా మాట్లాడతాడని జ్యోతి అనుకోలేదు అసలు తన తండ్రి విషయంలో కూడా తన అంచనాలు తారుమారయ్యాయి తనను చదివించటం తండ్రి ప్రోద్బలంవల్లనే జరిగింది లేకపోతే తల్లి పదవ తరగతితోనే మాన్పించేసేది ఆడపిల్లలు కూడా వ్యక్తిత్వం సంతరించుకోవాలని, ప్రతి విషయంలోను వాళ్ళకీ స్వేచ్ఛ ఉండాలన్న భావాలు తన తండ్రికున్నాయి అనుకుంది

మరి మొదట్లో ఉండేవే! ఎన్నో తడవలు ఆయన వ్యక్తంచేశాడు ఆ విషయంలో తల్లితో వివాదం కూడా పడ్డాడు కాని తన చదువు అయిపోయి పెళ్ళి విషయం వచ్చేటప్పటికి తండ్రిలో ఎంత మార్పు వచ్చింది? పెళ్ళి చేసుకొని ఆ తరువాత ఉద్యోగం చేసుకోవచ్చు కదా! అంటాడు ఆమె తండ్రి జగన్నాథం. ముందు తను స్థిరపడి తరువాత పెళ్ళి విషయం ఆలోచిస్తానని వాళ్ళతో వాదించి, పోట్లాడి తను బాబాయి దగ్గరకు వచ్చింది

అన్న జగన్నాథం ఆందోళన జనార్దన్ అర్థం చేసుకున్నాడు అందుకే జ్యోతికి నచ్చచెప్పాలని ప్రయత్నం చేస్తున్నాడు కాని ఆమె వినేటట్లు కనబడలేదు — తెగేదాకా లాగితే లాభంలేదు — దానివల్ల వచ్చే పరిణామాలు మరీ భయంకరంగా


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి ఆ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింది వివరించబడిన ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ | | వెల రూ |
|---|---|---|---|
| 30 రోజులలో హిందీ భాష | 4-50 | 30 రోజులలో మరాఠి భాష | 4-50 |
| 30 రోజులలో కన్నడ భాష | 4-50 | 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో మలయాళ భాష | 4-50 | 30 రోజులలో ఒరియా భాష | 5-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | 5-50 | 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 7-50 | 30 రోజులలో తమిళ భాష | 4-50 |
| 30 రోజులలో బెంగాళి భాష | 4-50 | 30 రోజులలో పంజాబి భాష | 5-50 |

ఆంగ్ల సంభాషణం - తెలుగు వెల రూ 7-50

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue


BP

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014

# ఆత్మ విశ్వాసం

ఉండొచ్చు లోకంలోకి వెళ్లి పరిస్థితులు చూసి ఆమే మంచీ చెడులు తెలుసుకుంటుంది అనుకున్నాడు

ఆ రోజు సెలవు పెట్టి జ్యోతిని ఎంప్లాయిమెంటు ఆఫీసుకు తీసుకెళ్లాడు ఆడపిల్లల రిజిస్ట్రేషన్‌కి పెద్ద క్యూ ఉంది ఆమె పేరు నమోదు చేయించటానికి ఆ రోజంతా సరిపోయింది దానివల్ల ఏం ప్రయోజనం? నాలుగు, అయిదు సంవత్సరాల కిందట రిజిష్టరు చేసిన వాళ్లకు దిక్కులేదు మరి ఇప్పుడు నమోదు చేసేవాళ్ల గతి ఏమిటో? అయినా మధ్య మధ్య ఆ ఎంప్లాయిమెంటు ఆఫీసుకు వెళ్లి కనుక్కుంటూ ఉండాలి ఆ సంగతే జ్యోతికి చెప్పాడు జ్యోతికి రెండు మూడు రోజుల్లో ఊరంతా చూపించాడు ఇంటినుంచి ఎంప్లాయిమెంటు ఆఫీసుకు, ఇతర సెంటర్లకు బస్సు రూట్లు చూపించాడు అదేకాక వేరే ఎక్కడయినా ఉద్యోగాలు దొరుకుతాయేమోనని వాకబు కూడా చేస్తున్నాడు




జ్యోతి ఎంప్లాయిమెంటు ఆఫీసుకి పోయి వస్తున్నది — బాబాయి ఏదన్నా ఆఫీసుకి వెళ్ళి రమ్మంటే వెళ్లి వస్తున్నది బస్సులలో పోవటం కష్టంగానే ఉంది అసలు రూటు తెలీకపోవటం ఒక సమస్య పైగా బస్సులలో ఒకటే రద్దీ రెండో రోజు ఇంటికి పొయ్యే బస్సు బదులు వేరే బస్సు ఎక్కి కోఠీకి పోయింది అక్కడ నుంచి ఆటోలో ఇంటికి పోయింది

ఎంప్లాయిమెంటు ఆఫీసు దగ్గర తనలాంటి వాళ్లు, యువతీ యువకులు ఎంతోమంది తారసపడ్డారు కొందరు తన వివరాలు అడిగారు ఇంకా కొందరు అడగకుండానే వాళ్ల వివరాలు చెప్పారు ఉర్దూలో మాట్లాడటం ఆమెకు సమస్య అయి కూర్చుంది బస్సులలోనూ, మిగతాచోట్ల మొదట్లో ఉర్దూలోనే మాట్లాడుతారు కొన్నిచోట్ల తను తెలుగులో చెప్తే వాళ్లూ తర్వాత తెలుగులోనే మాట్లాడుతున్నారు

''అమ్మాయ్ జ్యోతి! ఎందాకా వచ్చింది ఉద్యోగాల వేట'' అని అడిగాడు నవ్వుతూ

''అప్పుడే వస్తుందా బాబాయ్, ఎన్నో ఏళ్ల నుంచి ఉద్యోగాల కోసం తిరిగేవాళ్లు అక్కడ వేలల్లోనే ఉన్నారు'' అంది నిరుత్సాహంగా

''రోజూ నువ్వు అక్కడికి వెళ్ళటం వల్ల ఏం లాభం లేదు ఎక్కడకయినా వెళ్తే ప్రయోజనం ఉంటుందంటే నే చెప్తాగా'' అన్నాడు జనార్దన్

''బాబాయ్! అయితే నన్ను ఇంట్లోనే కూర్చోమంటావా? అటువంటి అప్పుడు ఇక్కడకు రావటమెందుకు? గుంటూరులోనే కూర్చోవచ్చుగా!'' అంది ఆయన సలహా నచ్చలేదని వ్యక్తంచేస్తూ

''సరే నీ ఇష్టం!'' అని ఊరుకున్నాడు

''ఏం హైరానా పడతావు తల్లీ, ఎప్పుడో అదే దొరుకుతుందిలే'' అన్నది లలిత కూడా

''రెండు రోజులకే అలిసిపోతే, ఇంకా ఎలా పిన్నీ?'' అంది జ్యోతి తన పట్టుదలను సడలించేది లేదన్నట్లు

* * *

ఒక రోజు ఎంప్లాయిమెంటు ఆఫీసు దగ్గర జ్యోతి నిలబడివుంది ఒక యువకుడు ఆమె దగ్గరకు వచ్చి ఆమె వివరాలు అడిగాడు

'మీరు ఎప్పుడు రిజిష్టరు చేశారు' అన్నాడు

'నాలుగు రోజులయింది' అన్నది

'అప్పుడే కాల్ వస్తుందని తిరుగుతున్నారా? భలేవారే!'' అన్నాడు ఎగతాళిగా

'మరి ఏం చెయ్యాలంటారు?' అని ఎదురు ప్రశ్న వేసింది.

'వాళ్ల కాల్స్ నమ్ముకుంటే అయినట్లే! మన ప్రయత్నం మనం చెయ్యాలి ఇంతకీ మీరు ప్రయివేటు కంపెనీలో అయినా ఉద్యోగం చేస్తారా? టెంపరరీ ఉద్యోగానికి ఒప్పుకుంటారా?' అని ఎన్నో ప్రశ్నలు వేశాడు

మొదట్లో అతను ఆ ఆఫీసుకు సంబంధించిన వాడేమోననుకుంది కాని మాటల్లో కాదని తెలిసింది

అతను ఏం చేస్తున్నది వివరంగా చెప్పలేదు కాని ఉద్యోగం కోసం ప్రయత్నించటంలో సహాయం చేస్తానని హామీ ఇచ్చాడు పేరు గోపీ అని చెప్పాడు ఏదో ఆఫీసులో టెంపరరీ ఖాళీలున్నాయని, అక్కడ నుంచి నలుగురు వెళుతున్నారన్న వార్త చేరవేశాడు వాళ్లతో తను వెళితే మంచిదనిపించింది నలుగురుతో పోవటం కనుక భయమేముందని, తను కూడా వాళ్లతో వెళతానంది సరేనని వాళ్ల దగ్గరకు తీసుకెళ్లాడు జ్యోతిని వాళ్లకు పరిచయం చేశాడు అతను కూడా వాళ్లతో బయల్దేరాడు ఆరుగురు బస్సులో లక్డీకాపూల్ చేరారు అక్కడ ఏదో ఆఫీసుకి తీసుకెళ్లారు ఖాళీలు టెంపరరీ కాదు, లీవు వెకెన్సీ అని చెప్పారు ఇష్టమయితే నెల రోజులు చేయవచ్చు అన్నారు నెలరోజుల కొరకయితే మాకు వద్దన్నారు మిగతావాళ్లు జ్యోతి ఆ ఉద్యోగం చేయటానికి ఒప్పుకుంది మర్నాడు రమ్మని వాళ్లు చెప్పారు

అక్కడ నుంచి ఇంటికి ఎలా పోవాలో ఆమెకు తెలీదు గోపీని అడిగింది — ''ఎలా పోవాలి'' అని అతను బస్సురూటు చెప్పటమేకాక తను వచ్చి దిగబెడతానన్నాడు అతనికి ఎన్నో థాంక్స్ చెప్పింది అతనివల్లనే కదా, ఈ ఖాళీ తనకు తెలిసింది అతను మాట్లాడించకపోతే తనకి అవకాశం వచ్చేదేకాదు మంచివాళ్లు ఎక్కడయినా ఉంటారు అనుకుంది బస్సు రాగానే ఇద్దరూ ఎక్కారు టిక్కెట్టు జ్యోతి తీసుకుంది 'మీరెందుకు తీసుకున్నారు నాకు కూడ' అన్నాడు నొచ్చుకుంటూ బస్సులో కొంచెం రద్దీగానే ఉంది ''ఈ బస్సులలో ప్రయాణం యమయాతనండి' అన్నాడు గోపీ అతను బస్సులో ఆమె పక్కన నుంచొని ఏవేవో చెబుతూనే ఉన్నాడు బస్సు ఆగగానే ఆ స్టాపు పేరు, అవి చెపుతున్నాడు ఆమె దిగాల్సిన స్టాపు రాగానే ఆమెతో అతను దిగాడు అక్కడ నుంచి తన ఇల్లు దగ్గరేనని ఆమె చెప్పింది ''రేపు మరి ఆఫీసుకు ఎలా పోతారు, ఇటునుంచి రూటు తెలీదు కదా'' అన్నాడు ''మా బాబాయిని వెంటబెట్టుకొస్తానండి! చాలా థాంక్సండి! మీ వల్లె ఆ ఉద్యోగం వచ్చింది'' అంది

పిన్ని, బాబాయిలతో ఈ విషయం చెప్పింది జనార్దన్‌కి ఆశ్చర్యంగానే ఉంది నాలుగురోజులు కాలేదు ఈ ఊరు వచ్చి ఊరు పూర్తిగా తెలీదు ఖాళీ ఉందని ఈ అమ్మాయికి ఎలా తెలిసింది? అక్కడకు ఎలా వెళ్లింది? అనుకొని వివరాలన్నీ అడిగాడు కిందటిరోజు జరిగినవన్నీ చెప్పింది

మర్నాడు జనార్దన్ జ్యోతిని ఆ ఆఫీసుకి తీసుకెళ్లాడు అక్కడ ఉన్న సెక్షన్ హెడ్‌తో మాట్లాడాడు సాయంత్రం ఇంటికి ఎలా రావాలో చెప్పి అతను ఆఫీసుకు వెళ్ళాడు ఆఫీసులో వాళ్ళు చెప్పిన పని చేసింది పని తేలికగానే ఉందనుకొంది మిగతా ఆడవాళ్లతో పరిచయం చేసుకుంది సాయంత్రం ఇంటికి బయలుదేరుతుండగా గోపి కనిపించాడు

'ఎలా ఉందండి ఉద్యోగం' అని అడిగాడు

'బాగానే ఉందండి మీ మేలుమరువలేను' అంది

''ఇంటికేనా పోతున్నారు?'' అని అడిగాడు